
# మెప్పు

వసుంధర

నాకు కథలు రాసి పొగడ్తలందుకోవాలని మహా మనసు. ఐతే అదేమిటో నేనెంతో కష్టపడి బాగా రాసిన మొదటి మూడు కథలూ పత్రికల నుంచి వెంటవెంటనే తిరిగొచ్చాయి. ఎందుకు తిరిగొచ్చాయో ఎవర్న డగాలీ అనుకుంటే పెద్దక్క, చిన్నన్న, అమ్మ, వదిన తట్టారు. ఎందుకంటే....






పెద్దక్కకు పెళ్ళై విశాఖపట్నంలో ఉంటోంది. చిన్నన్న చదువై అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. అపుడూ ఇప్పుడూ ఇంట్లో నేనే చిన్నదాన్ని. వదినకి ద్దరు పిల్లలు కానీ పెద్దాడికే నాలుగేళ్ళు లేవు కాబట్టి వాళ్ళు మనుషులకింద లెక్క కాదు. అమ్మకు బొత్తిగా మాట తీరువ లేదు. ఒక్క వదిన తప్ప ఇంట్లో వాళ్ళెవ్వరం అమ్మ మాటకు విలువనివ్వం. వదిన మాత్రం అమ్మ చెప్పిందానికల్లా బుద్ధిగా తలూపుతుంది. "ఏం చేస్తే బాగుంటుందత్తయ్యా" అంటూ సలహాక్కూడా వెడుతుంది. అందుకని అమ్మకు వదినంటే బోలెడు ప్రేమ. మేం తన మాట లెక్క చెయ్యనప్పుడల్లా వదిన్ని చూసి నా విలువ తెలుసుకోండర్రా అని మా మీద రెచ్చిపోతుంది. ఐతే తన విలువేమిటో అమ్మకూ తెలుసు. అందుకే అన్నింటికీ నన్ను సలహా అడిగే ఈ పిల్ల ఈ మాయాప్రపంచంలో ఎలా బ్రతుకుతుందోనని వదిన గురించి దిగులు పడుతుంది.

మరి వదినకీ, అమ్మకీ నా కథలేం చూపిస్తానను కుంటే ఇక మిగిలిన వాళ్లు నాన్న, పెద్దన్న అనుభవ జ్ఞుడని ధైర్యంచేసి ముందు నాన్నకు చూపిస్తే ఆయన వాటిని ఎగాదిగా చూసి, "నువ్వేం రాసినా చాలా బాగుంటుందమ్మా" అన్నారు. మెచ్చుకు న్నది దస్తూరీనని తెలిసిపోయినా పొగడ్త కాబట్టి సంతోషించా. ఐతే చదివి అభిప్రాయం చెప్పమనే ధైర్యంలేక పెద్దన్నయ్య దగ్గర కెళ్ళా.

వాడు నా చేతిలోని కథల్ని అందుకునే ధైర్యం కూడా చెయ్యలేదు. "కథల్రాయడం చాలా మంచిది. నీ ఆలోచనాశక్తి మెరుగు పడుతుంది" అన్నాడు గంభీరంగా.

"నా ఆలోచనా శక్తికి మూడుసార్లు మెరుగు పెట్టా. చదివి అభిప్రాయం చెప్పు" అన్నాను.

అప్పటికీ వాడు నా కథలందుకుందుకు చెయ్యి చాపలేదు. ముఖాన్నింకా గంభీరంగానే కొనసాగిస్తూ, "అభిప్రాయాలు చెప్పేవాళ్ళు పలు రకాలు. టాలెంటును గుర్తించి మెచ్చేవాళ్లు, అభిమానంతో మెచ్చేవాళ్లు, ప్రయోజనమాశించి స్వార్థంతో మెచ్చే వాళ్ళు, అభిప్రాయమడిగావని మురిసిపోయి మెచ్చేవాళ్లు, మళ్ళీ మళ్ళీ అభిప్రాయమడగాలని మెచ్చేవాళ్లు" అంటూంటే.

వాణ్ణి మధ్యలో ఆపి, "నాక్కావలసింది మెప్పు కాదు. నా కథల్లోని మంచిచెడ్డల విశ్లేషణ" అన్నాను.

"అది చెబుతుంటేనే మధ్యలో ఆపేసావు. లోపాలు చెప్పేవాళ్ళూ పలురకాలు. టాలెంటుకి అసూయపడేవాళ్ళు, టాలెంటు లేనప్పుడు నలుగురిలో నవ్వులపాలు కాకూడదనుకునే ఆత్మీయులు, శాడిస్టులు, వెల్ విషర్సు"

ఇంతకీ వీళ్ళలో నువ్వెవరు? అది చెప్పు" అన్నాను విసుగును దాచుకుంటూ.

"నీకు తెలియందేముంది? వీళ్లూ ఇంకా నన్ను చెప్పనీకుండా నువ్వాపిన మరి కొందర్లోనూ కూడా నేను లేను. సాహిత్యానికీ నాకూ ఆమడ దూరం తీసుకెళ్ళి మీ వదినకు చూపించు"

"వదినా?" అన్నాను నీరసంగా.

అన్నయ్య నా మొహం చూసి నవ్వి, "వదిన్నలా తీసిపారేయకు. తను ప్రముఖుల కథల పుస్తకాలు తెగ చదువుతుంది తెలుసా?" అంటూ తన సలహాకు విలువనాపాదించే ప్రయత్నం చేసాడు.

కాకిపిల్లే కాదు. కాకిపెళ్ళామూ కాకికి ముద్దే. కానీ అబద్ధమెందుకూ వదినంటే నాకూ ఇష్టమే. ఎందుకంటే తను నాకంటే ఐదేళ్ళే పెద్దైనా నన్ను తన పిల్లలకంటే ఎక్కువగా ముద్దు చేస్తుంది. నన్నసలు వంటగదిలోకి రానివ్వదు. నా గది, మంచం, పక్క, పుస్తకాలు, బట్టల బీరువా అన్నీ అమిర్చినట్లు సర్ది పెడుతుంది. ఎవరైనా నా గదితీరు చూసిన నన్ను మెచ్చుకుంటే తను క్రెడిట్ తీసుకోదు. నేనూ అప్పటికి క్రెడిట్ తీసేసుకుని ఆ తర్వాత ఎవరూ లేనప్పుడు వదిన ఒక్కత్తికీ ఒకసారి సారీ చెబితే "నువ్వేం చేసినా నచ్చుతుంది. సారీ చెబితే నచ్చదు" అంది వదిన.

అప్పుడు నాకు వదిన ఇంకా నచ్చేసింది. అలాంటి వదినకి ఓసారి నా కథలు చూపిస్తే నేను కథలు రాసానని ఆశ్చర్యపోతుందనీ, కథలు గురించి నాకేం తెలుస్తుందమ్మా అంటుందనీ అనుకున్నాను. కానీ వదిన గుప్పిట్లో బఠానీలుపోస్తే అందుకున్నట్లు నా కథలందుకుని, "ఇప్పుడు పనిలో ఉన్నానమ్మా! రాత్రికి వీలుచేసుకుని చదివి రేపు సాయంత్రానికల్లా అభిప్రాయం చెబుతా" అంటే కొంచెం నిరుత్సాహపడ్డాను.

ఈలోగా మర్నాడు కాలేజీలో నా క్లాస్‌మేట్ నీరజకు నా కథల గురించి చెబితే, "ముగ్గురు పత్రికా సంపాదకులు తిప్పి పంపారంటే నీ కథల్లో లోపాలున్నాయి. అవేమిటో తెలుసుకుందుకు నువ్వు నీ కథలను సాహితీ పరులకో, సాహిత్యాభిలాష ఉన్నవారికో ఇవ్వాలి కానీ నాన్నలకీ, అన్నయ్యలకీ, వదినలకీనటే ఇవ్వడం?" అని మందలించింది. తెలిసినవాళ్ళలో అలాంటి వారుంటే చెప్పమంటే, "ఎవరో ఎందుకు నేను లేనా? కాలేజి మాగజైన్లో పడ్డ నా వ్యాసాన్ని ముగ్గురబ్బాయిలు స్వయంగా వచ్చి మరీ మెచ్చుకున్నారు తెలుసా?" అంది.

"అమ్మాయిల వ్యాసాన్ని అబ్బాయిలు మెచ్చుకోవడం పెద్ద విశేషమేం కాదుగానీ అమ్మాయిలెవరైనా మెచ్చుకున్నారా?" అన్నాక గుర్తొచ్చింది నేనైతే ఆ వ్యాసాన్ని అంతవరకూ చదవలేదని.

"మా చెల్లెలు, బామ్మ, అమ్మ" అంటే కిసుక్కున నవ్వాను నీరజకు అర్థమై, "ముందెక్కడో అక్కడో రచన ప్రచురించు. దానికి రెస్పాన్సు వచ్చాక మిగతావి మాట్లాడుకుందాం" అంది ఉక్రోషంగా.

మేగజైనుకో వ్యాసం రాసి నాకు సీనియర్నను కుంటోంది నీరజ. నేనంటూ రాస్తే పత్రికలకే రాస్తా. అప్పుడు నాకొచ్చే, రెస్పాన్సుకది దిమ్మెరపోవాలి. ఈలోగా దానికి నా కథలు చూపకూడదనుకున్నా.

ఇంటికొచ్చేసరికి వదిన చాలా సిన్సియర్‌గా సిద్ధంగా ఉంది. ప్రతికథనూ అన్ని కోణాలనుంచీ పరిశీలించి విశ్లేషిస్తూ "నీ భాష, శైలి, ఎన్నుకున్న ఇతివృత్తాలు అద్భుతం. నేను చెప్పినట్లు చిన్నచిన్న మార్పులు చేసి తిరగరాయి" అంది వదిన పక్కా సాహితీపరునిలా.

"వదినా! కథలపట్ల నీకింత పరిజ్ఞాన ముంటుందని నేనూహించలేదు" అన్నాను ఆశ్చర్యంగా

"పరిజ్ఞానం ఊహతో కాదు. సాన్నిహిత్యంతో వస్తుంది. కథలకు సంబంధించి మన సాన్నిహిత్యం ఇప్పుడే ప్రారంభమైంది" అని నవ్వింది వదిన.

నేను తను చెప్పినట్లే కథలు తిరగరాస్తే వదిన తృప్తిపడక శాంపిల్‌కని ఓ కథ తనే తిరగరాసింది. అది చదివితే అంత బాగా రాయడం నావల్లనౌతుందా అని నీరసపడితే, "అంటే నేను రాసింది నీకు నచ్చింది. అంటే నీలో మంచిని స్వీకరించే గుణముంది. ఉత్తమ కథలకులకది ముఖ్య లక్షణం. ఇంతకీ ఇది నువ్వు రాసిన కథే. నేను చేసినవి చాలా చిన్నమార్పులు" అంది వదిన.

ఇవన్నీ తనకెలా తెలుసని అడిగితే, ''కథలు సరదాక్కాక విశ్లేషణాత్మకంగా చదివితే పాఠకులకూ, కథకులకూ కూడా ప్రయోజనం. నా దగ్గర పత్రికల్లోంచి కట్ చేసిన మంచి కథలు చాలా ఉన్నాయి. అవి చదువుతూండు'' అంది వదిన నేనా కథలు చదివి వదిన అభిరుచి గొప్పదని గ్రహించాను.

వదిన ఇచ్చిన టిప్పుతో నేను కథలు రాసేదాన్ని. తను పోస్టు చేసేది. ఆరు నెలల్లో ఆ మూడూ కాక నావి మరో నాలుక్కథలు ప్రచురితమయ్యాయి. ఆ కథల్ని అబ్బాయిలేకాక అమ్మాయిలూ పొగిడారు. నీరజ కూడా అసూయవిడిచి తన వ్యాసాలు ముందుగా నాకు చూపించి సలహాలడుతోంది.

పత్రికల్లో నా కథల్ని పొగుడుతూ ఉత్తరాలు పడేవి. చాలామంది నా కథలను ప్రముఖ రచయిత్రి శ్వేత రచనలతో పోల్చేవారు. అప్పుడు నాలోనూ ఆసక్తి పుట్టి వదిన్నడిగితే తను నాకా కథల కట్టింగ్సూ ఇచ్చింది. నిజంగానే వాటికీ నా కథలకూ పోలికుందని గ్రహించి మరింత మురిసాను.

కథ ప్రచురణకు ముందే చుట్టాలకూ, స్నేహితులకూ చెప్పేదాన్ని. కథ పడగానే కథను మెచ్చుకుంటూ బోలెడన్ని ఫోన్లొచ్చేవి. విశాఖపట్నంలో ఉండే అక్కయ్య మాత్రం తనకు పత్రికలు చదవడం వీలు కావడంలేదనీ ఇక్కడికొచ్చినప్పుడు చదువుతాననీ చెప్పేది.

ఇప్పుడు నాకో కొత్త గుర్తింపు. నా మీద కథ రాయవూ అనేవారు కొందరు. అమ్మో తనతో జాగ్రత్తగా మాట్లాడాలి కథగానీ రాసేయగలదు అనేవారు కొందరు. ఇప్పుడేం రాస్తున్నావనడిగేవారు కొందరు.

తర్వాత ఇంటి చిరునామాకు రమేష్, సుజాత, డేవిడ్ అనే ముగ్గురు అపరిచితుల ఉత్తరాలొచ్చాయి. మొదటి ఇద్దరూ నాతో కలంస్నేహం కోరారు. డేవిడ్ నా కథలోని చిరులోపాలు చెప్పి అలాంటివి సవరించుకోవాలన్నాడు.

మరో నాలుగు నెలల్లో నావి మరో ఐదు కథలు ప్రచురించబడ్డాయి. అంతా పొగిడారు కానీ ఇంకా అక్క నా కథ ఒక్కటీ చదవలేదు. నాకు ఉత్తరాలు రాసే వాళ్ళు పెరిగారు కానీ డేవిడ్ ఒక్కడే ఇంకా నా కథల్లో చిరులోపాలు ఎన్నుతూనే ఉన్నాడు.

అక్క, డేవిడ్‌ల గురించీ బాధపడితే, ''ఎదుగుదలకు నిజాయితీపరులే ముఖ్యం. గుర్తింపుకోసం అవసరానికి మించి తాపత్రయపడకు. ఓ మంచి కథ రాయి. నచ్చినవారు మెచ్చితే సంతోషించు. విమర్శను సహృదయంతో స్వీకరించు. అదంతటితో మర్చిపోయి మరో కథ రాయి. అలా రాసుకుంటూ పోవడమే కథలకుల కర్తవ్యం. గుర్తింపుకోసం వెంపర్లాట కాదు'' అంది వదిన.

''కానీ తెలుగునాట రచయితలన్నా, రచయిత్రులన్నా గొప్ప క్రేజ్ ఉంది కదా! మరిన్ని మంచి కథలు రాయడానికి ఆ గుర్తింపు ఇచ్చే నిషా కూడా అవసరం కాదంటావా?'' అన్నాను.

''తెలుగునాట కథకులంటే క్రేజ్ ఉందనుకోవడం భ్రమ. తెలుగునాట కథకున్న ఆదరణే అంతంత మాత్రం. కథాసంకలనాల అమ్మకానికి ప్రచురణకర్తలు పడే ఇబ్బందులే అందుకు నిదర్శనం. పత్రికలు నడిపేవారు పాఠకులకోసం అన్నీ సమకూర్చుతూ తమ సాహితీ తృప్తికోసం కొన్ని కథలూ ప్రచురిస్తున్నారు. కథకులేమో తమ కథలకూ, తమ పరిధిలోకి వచ్చినవారి కథలకూ పరిమితమై సమకాలీన కథాసాహిత్యంపై సంపూర్ణావగాహనకు దూరమౌతున్నారు. విమర్శకులూ అంతే అలాంటివారి పరిమితజ్ఞానం సమగ్రవ్యాఖ్యగా చెలామణీ కాగా లభించే గుర్తింపు పరిణతి చెందిన కథకులకు తృప్తినివ్వదు, ఇవ్వకూడదు. కాబట్టి కథ రాయి. వాటి గురించి దండోరా వెయ్యకు'' అంది వదిన.

నాకీ సలహా నచ్చలేదు. నా కథను మెచ్చుకుంటూ ఎన్నో ఫోన్‌కాల్సు. ఉత్తరాలు. వాటిని నేనెలా వదులుకోగలను అనుకుంటే అప్పుడే నాకో అనుమానమొచ్చింది. తన సలహాలతో రచయిత్రినైపోయినానని వదిన కూడా నా మీద అసూయ పడుతోందేమో! అందుకే నా కథలను చదవని అక్కయ్యనీ, వాటిలో లోపాలెన్నే డేవిడ్‌నీ చక్కగా సమర్థిస్తోంది. బహుశా నన్నభినందించేవారికంటే వాళ్ళే ఆమెకు ఎక్కువ సంతోషాన్నిస్తున్నారేమో!

ఇలా ఉండగా ఒకరోజున నాకు ఆకాశవాణి నుంచి ఫోనొచ్చింది. తమ కార్యక్రమంలో చదవడానికి వారు నా కథ 'జిజ్ఞాస'ను ఎన్నుకున్నారట. అనుమతి కోసం అగ్రిమెంటు ఫారాలు పంపిస్తామన్నారు. నా ఉత్సాహానికి అవధులు లేవు. సరేనన్నాను కానీ నేనా విషయాన్ని వదినక్కూడా చెప్పలేదు.

నాలుగురోజుల్లో ఆకాశవాణి నుంచి అగ్రిమెంటు ఫారాలొస్తే సంతకంపెట్టి పంపించాను. మరో రెండు వారాల్లో ఆకాశవాణి వారు కథ ప్రసారం కానున్న తేదీ, సమయం ఉత్తరం ద్వారా తెలియబర్చారు. ప్రసారానికిక రెండు వారాలే టైముంది. ఉత్సాహం పట్టలేకపోయాను. పుస్తకమైతే ఎంతమంది చదువుతారో కానీ రేడియో ఐతే లక్షలాది జనం వింటారు. నాకిక ఫోన్లే ఫోన్లు ఉత్తరాలే ఉత్తరాలు.


ఈ విషయం పరోక్షంగా చెప్పడానికి తెలివిగా, ''మా ఇంట్లో రేడియో రికార్డరు లేదు. మీ ఇంట్లో ఉంటే రికార్డు చేసి పెట్టండి'' అనే ఓ డైలాగు తయారుచేసుకుని ఇంట్లోవాళ్ళతో సహా కనిపించిన వాళ్ళందరికీ చెప్పాను. తెలిసిన వాళ్ళందరికీ ఫోన్లు చేసాను. అభిమానులకి కార్డులు రాసి పోస్ట్ చేసాను.


అప్పుడు నాకో కొత్త విషయం తెలిసింది. టీవీలొచ్చేక రేడియోల్నీ, సీడీలొచ్చేక టేపురికార్డర్సునీ పట్టించుకునేవారే లేరు. కొందరిళ్ళలో రేడియోలు లేనేలేవు. ఉన్నవాళ్ళు రిపేర్ చేయించాలి. ఐనా చాలామంది ఎలాగోలా రేడియో సంపాదించి కథ వింటామని హామీ ఇచ్చారు. రికార్డింగు విషయంలో ఒక్కరూ గ్యారంటీ ఇవ్వలేదు.

అప్పుడు గుర్తొచ్చింది మా ఇంట్లోనూ ఓ రేడియో రికార్డరుండాలని వదిన్నడిగితే ''అతయ్య భక్తి పాటలు వింటానని తీసుకున్నారు'' అంది. అమ్మనడిగితే ఆలోచించి ఆలోచించి ''ఆ గుర్తొచ్చింది బయట పెట్టడానికి చోటు దొరక్క నా బట్టల బీరువాలో ఉంచా. దానికటూ ఇటూ రెండు స్పీకర్లున్నాయేమో చాలా చోటు ఆక్రమించింది. కొన్ని పట్టుచీరలు తీసేసి మీ వదిన బీరువాలో దాచమన్నాను. నువ్వది తీసుకుంటే మళ్ళీ ఆ పట్టుచీరలు నా బీరువాలోనే పెట్టుకోవచ్చు'' అంది హాపీగా.

బీరువాలోంచి రేడియో రికార్డర్ తీయడానికి అమ్మా నేనూ కాస్త కుస్తీ పట్టాల్సొచ్చింది. బయటకు తీసాక, ''ముందే చెబుతున్నాను. మళ్ళీ వెనక్కిస్తే నేను తీసుకోను'' అనేసింది అమ్మ.

సరేనని ఆత్రుతగా టెస్టింగ్ మొదలెట్టా. ఆన్






చేస్తే రేడియో ఫరవాలేదు. స్టేషన్లు పలికాయ్. వంటింటి నానుకునున్న స్టోర్ రూంలోని అట్టపెట్టె లోంచి కాసెట్లు తెచ్చి ప్లే చేస్తే పాటలొచ్చాయ్. అంటే టేపూ పనిచేస్తోంది. రికార్డింగు టెస్ట్ చేద్దామంటే బ్లాంక్ కాసెట్ దొరకలేదు. పాత టేపు చెరిపేద్దామంటే భక్తి పాటలు చెరపడానికి వీల్లేదంది అమ్మ. వదినకు పాత తెలుగు సినిమా పాటలిష్టం. అన్నయ్యకు హిందీ పాటలిష్టం. స్టోర్లో ఓ మూల పడున్న కాసెట్లు ఉన్నట్లుండి అందరికీ ఒక్కసారిగా ముఖ్యమైపోయాయని విసుక్కుందామంటే మిగతావాళ్ళు వద్దన్నవన్నీ నాకు ముఖ్యమయ్యాయ్. ఇక అమ్మేకదా లోకువ ఓ భక్తి పాటల కాసెట్లో అర నిముషం రికార్డు చేసా. రికార్డింగు అవుతోంది కానీ పాత పాట చెరిగిపోవడం లేదు. అందుకని బ్లాంక్ కాసెట్ కొత్తది కొనాలనుకున్నాను.

ఏ షాపుకెళ్ళినా బ్లాంక్ సీడీలూ, డీవీడీలు తప్ప కాసెట్లు దొరకలేదు. ఓ షాపువాడైతే నన్ను మాటల్లో పెట్టి ఎవరెవరికో ఫోన్లు చేసి అరగంట ఆపాడు. కాసెట్ తెప్పిస్తున్నాడనుకున్నాను. కానీ ఈ రోజుల్లో బ్లాంక్ కాసెట్ కొనడానికొచ్చిన మనిషంటే అదీ ఓ అమ్మాయిని జూలో జంతువులా చూసేవాళ్లు చాలా మందున్నారని తర్వాత నాకు తెలిసింది. వచ్చినవాళ్లలో కొందరు మీడియా వాళ్లూ ఉన్నారు. కాసెట్ ఇస్తే నేనేం చేసుకుంటానని వాళ్ళ కుతూహలం. కథ గురించి చెప్పడానికి మొహమాటపడి రేడియోనుంచి కొన్ని ప్రోగ్రాములు రికార్డు చేసుకోవాలని చెప్పాను. అప్పుడక్కడున్నవాళ్ళు మరింత ఆశ్చర్యపడ్డారు. కొందరైతే నా ఆటోగ్రాఫ్ తీసుకున్నారు.

ఇది లాభం లేదని రేడియో రికార్డర్ని నాకు తెలిసిన మెకానిక్ దగరకు తీసుకెళ్లి ప్రోబ్లం చెప్పాను. సరికొత్త ఇంపోర్టెడ్ డీవీడీలను ఆఫ్టరాల్‌గా రిపేర్ చేసే ఆ మెకానిక్ నా మెషీన్ని ఎగాదిగా చూసి, ''ఇది పిలిప్పుది కదమ్మా! సర్వీసింగ్ సెంటర్లో ఇవ్వండి'' అని ఉచిత సలహా పారేసాడు. సరేనని సర్వీసింగ్ సెంటరుకెడితే వాళ్ళు ఫిలిప్సు కంపెనీ టేపు రికార్డర్లు కూడా చేసేదా అని ఆశ్చర్యపోయి నన్ను టైమ్ మెషీన్లో ఇరవయ్యోకటో శతాబ్దానికి వచ్చిన ఆదిమానవుడన్నట్లు చూసారు.

ఏ దారీ కనపడక అక్కకు ఫోన్లో విషయం చెప్పాను. చిత్రమేమిటంటే అక్క దగ్గర రేడియో రికార్డరే కాదు, మూడు బ్లాంక్ కాసెట్లు కూడా ఉన్నాయి. '' ఇన్నాళ్ళకు నా చెల్లెలి కథ వినే అవకాశమొచ్చింది. రికార్డు చేసి కొన్నాళ్లపాటు తనివితీరా రోజు వింటాను'' అంది అభిమానంగా. ఓ బ్లాంక్ కాసెట్ నాకు కొరియర్లో పంపుతానంది. ఆ మాట నిలబెట్టుకుంది కూడా!

ఆ రోజు సోమవారం. రాత్రి ఎనిమిది గంటలు. రివాజు ప్రకారం అప్పటికే అంతా భోజనాలు ముగించాం. రివాజుకు విరుద్ధంగా టీవీ కట్టేసి రేడియో ముందు కూర్చున్నాం. అనుకున్న టైముకి అనుకున్న కార్యక్రమం మొదలైంది. కానీ అందులో నా కథకు బదులు ప్రముఖ రచయిత్రి శ్వేత కథ చదివారు. కథ రికార్డయింది కానీ నేనది వినలేదు. ప్రోగ్రాం అయ్యాక అక్కనుంచీ, డేవిడ్‌నుంచీ, ఇంకా నలుగురైదుగురి నుంచీ ఫోన్లొచ్చాయి నా కథ రాలేదేమిటని. అసలే బదుల చెప్పడానికి ఇబ్బంది పడుతుంటే దొరికాను కదా అనుకుందేమో ''అందుకే నేనంటాను. దేనికీ ముందుగా ఇంత హడావుడి అచ్చిరాదు. గుట్టుచప్పుడు కాకుండా ఉండడం నేర్చుకో'' అని మందలించింది వదిన.

నేను ఉక్రోషంతో కళ్ళనీళ్ల పర్యంతమై, ''నేనేం ఊరికే హడావుడి చెయ్యలేదు. నీ కథ కూడా ఇలాగే రేడియో ప్రసారానికి ఎన్నికైతే అర్థమయ్యేది నీకు నా బాధ'' అన్నాను.

వదిన మరి మాట్లాడలేదు కానీ అన్నయ్యకు నా మీద జాలి పుట్టిందో ఏమో, ''రేడియో స్టేషన్లో మాధవి గారు నీ ఫ్రెండే కదా! అసలేం జరిగిందో ఆమె నడిగి తెలుసుకో'' అన్నాడు వదినతో. వెంటనే వదిన ఆమెకు ఫోన్ చేసి ''ఇప్పుడు డ్యూటీలో ఉందిట. పది దాటేక తనే చేస్తానంది'' అంది.

తాను వెంటనే అంతా టీవీల వద్దకు పరుగెడితే నేను మాత్రం మనసు పాడై నా గదిలోకెళ్ళి మంచమెక్కేసాను.

ఎంత ప్రయత్నించినా నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతూంటే చూస్తూండగా పదయింది కాబోలు గదిలో ఫోన్ మోగింది. అది వదినకు తెలిసిన రేడియో మాధవే అయుంటుందని అనుమానమొచ్చి ఏం జరిగిందోనన్న కుతూహలంతో పారలెల్ కనెక్షన్ తీసాను.

ఊహించినట్లు అది మాధవి ఫోనే. కానీ అందులో నేనూహించని విషయమొకటి తెలిసింది. ప్రముఖ రచయిత్రి శ్వేత ఎవరో కాదు. అది మా వదిన కలంపేరు! గుర్తింపును నిరసించే ఆమె అజ్ఞాతంగా రచనలు చేస్తోంది. ఆమెకొచ్చే ఉత్తరాలన్నీ పోస్ట్‌బాక్స్ చిరునామాకు వెతాయి. అన్నయ్య ఆమె ఆశయాన్ని మన్నించి సహకరిస్తున్నాడు. ఆమె రికమండేషన్ నా కథల ప్రచురణకు సహకరించింది. ఆమె చెప్పడంవల్లనే ఆకాశవాణి వారు నా కథను ఎన్నిక చేసారు.

''కన్ఫ్యూజనంతా నా కారణంగా వచ్చింది నీ కథ టైమింగ్సు నీ ఆడపడుచుకీ, నీ ఆడపడుచు కథ టైమింగ్సు నీకూ కమ్యూనికేట్ చేసాం. ఆమె కథ వచ్చేవారం వస్తుంది. మేము అఫీషియల్ కమ్యూనికేషన్ పంపుతాం కానీ ఈలోగా నువ్వా విషయం ఆమెకు చెప్పు'' అంది మాధవి.

కాసేపు నాకు బుర్ర పని చెయ్యలేదు. ఫోన్లు, ఉత్తరాలలో అభినందనపరంపరలకోసం తపించి పోతూ నేను రేడియో ముందు కూర్చుంటే అప్పుడొస్తున్న కథ తనదని మాటవరసక్కూడా అనలేదు వదిన. ఆమెతో నేను, ''నేనేం ఊరికే హడావుడి చెయ్యలేదు. నీ కథ కూడా ఇలాగే రేడియో ప్రసారానికి ఎన్నికైతే అర్థమయ్యేది నీకు నా బాధ'' అన్నాను.

కథకులకు గుర్తింపును నిరసించే ఆశయాన్ని ప్రచారం చేయడానికి వదినకు మించిన అర్హత ఎవరికుంటుంది అని ఇప్పుడనిపిస్తోంది.

కానీ మనిషి ఏంచేసినా గుర్తింపు కోసమే అయినప్పుడు అసలు వదిన ఆశయానికి అర్థముందా?!

''కథకులూ, విమర్శకులూ తమ పరిధిలోకి వచ్చినవారి రచనలకే పరిమితమై సమకాలీన కథా సాహిత్యంపై సంపూర్ణావగాహనకు దూరమౌతున్నారు. అలాంటివారి పరిమిత జ్ఞానం సమగ్రవ్యాఖ్యగా చెలామణీ కాగా లభించే గుర్తింపు పరిణతి చెందిన కథకులకు తృప్తినివ్వదు'' అంది వదిన.

జవాబు మర్నాడుదయమే దొరికింది నాకు. రాత్రి రేడియోలో వచ్చిన నా కథ అద్భుతంగా ఉందంటూ వరుసగా పదహారు ఫోన్ కాల్సొచ్చినప్పుడు!

★